క్లుప్తంగా

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



రాజీనామా చేస్తున్న వలంటీర్లు

వీరవాసరం: మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం గ్రామ సచివాలయ వ్యవస్థ వలంటీర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరవాసరం మండల వ్యాప్తంగా 60 మంది వలంటీర్లు గ్రామ సచివాలయాలు వద్ద గ్రామ రాజీనామా పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు.

ప్రారంభమైన దాళ్వా మాసూళ్లు



దేగాపురం వద్ద వరికోత యంత్రంతో మాసూళ్లు సాగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవాని తిప్ప, గునుపూడి, యనమదుర్రు, దిరుసుమర్రు గ్రామాల్లో శుక్రవారం దాళ్వా మాసూళ్లు ప్రారంభమయ్యాయి. మండలంలో అనాకోడేరు, కొమరాడ, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, పెదగరువు తదితర గ్రామాల్లో సుమారు 8 వేల 300 ఎకరాల్లో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టారు. దాళ్వాలో ముందుగా వరినాట్లు వేసిన వరిచేలు పక్వానికి రావడంతో రైతులు వరి కోత యంత్రాలతో మాసూళ్లు సాగిస్తున్నారు. కొన్ని చోట్ల ధాన్యాన్ని ఆరబెట్టి ఆర్‌బీకేలకు తరలిస్తున్నారు. ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బీవీ రాజు డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా



బీవీ రాజు డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా పత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్ కృష్ణంరాజు

భీమవరం: భీమవరం పట్టణంలోని బీవీ రాజు డిగ్రీ అండ్ పీజీ కళాశాల స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం విలేకర్లకు వివరించారు. స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ యుజీసీ ఉత్తర్వులు జారీ చేసిందని హోదాకు సంబంధించిన గుర్తింపు పత్రాలను ఆదికవి విశ్వవిద్యాలయం ఉపకులపతి కె పద్మరాజు, రిజిస్టర్ జి సుధాకర్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. దీనితో కళాశాల స్వయంగా 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా అకాడమిక్ క్యాలెండర్, సిలబలస్‌ను రూపొందించుకుని తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే అవకాశం దక్కిందని కృష్ణంరాజు తెలిపారు.

అన్నసమారాధన



స్థానిక సంతపేటలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక సంతపేటలో శుక్రవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోమటి రాంబాబు, ఉపాధ్యక్షుడు పిట్టా పాండురంగారావు, కార్యదర్శి పిట్టా రాము సభ్యులు పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించుకోవాలి

భీమవరం: ప్రపంచ కార్మికులంతా పండుగలా జరుపుకొనే కార్మికుల పర్వదినం మేడు ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెలబోయిన రంగారావు చెప్పారు. భీమవరంలో శుక్రవారం కార్మిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే కార్మిక ఐక్యత, సంఘటిత పోరాటాలు, మేడే ప్రాముఖ్యత వివరిస్తూ ఘనంగా జరుపుకోవాలని కోరారు. న్యాయమైన హక్కుల సాధనకు ఉద్యమించిన రోజే మే డే అన్నారు. కిల్లరి మల్లేశ్వరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నీలపు శ్రీను, డి సత్యనారాయణ, రెల్లి రాము, పాలా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాం.. ధైర్యంగా ఓటడుగుతున్నాం





ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

- పట్టణాన్ని అభివృద్ధి చేశాం
- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 29, 30, 31 వార్డుల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా నెరవేర్చారని అన్నారు. అంతేకాకుండా భీమవరం నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల దగ్గరికి వెళ్లి ఓటు అడిగే హక్కు మనకు మాత్రమే ఉందని అన్నారు. ముఖ్యంగా భీమవరం నియోజకవర్గంలో ఈ 58 నెలల పరిపాలనలో ఎంతో అభివృద్ధి సాధించామని అన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను కూడా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. ప్రతి వార్డులో కూడా తాను చేసిన అభివృద్ధి ప్రజలకు స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. వార్డుల శివారు ప్రాంతాల్లో కూడా రోడ్లను, డ్రైయినేజీ నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పట్టణంలోని ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారికి రిజిస్ట్రేషన్ పట్టాలను కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి రైల్వే అండర్ టన్నెల్స్‌ను నిర్మించడం జరిగిందన్నారు. మరో ప్రక్క ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి ఆరోగ్య భద్రతను కల్పించేందుకు భీమవరంలో వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. నాడు– నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి మించి అభివృద్ధి చేశామని, అదే సమయంలో ఇదే పథకంలో ప్రభుత్వ ఆస్పత్రులను కూడా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రతి వార్డులో కూడా సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ఇంటి ముంగిటకు తీసుకురావడం జరిగిందని అన్నారు. భీమవరం పట్టణానికి మాస్టర్ ప్లాన్ కూడా రూపొందించడం జరిగిందన్నారు. ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను భీమవరం పట్టణంతోపాటుగా వీరవాసరం, భీమవరం మండలాల్లో పెద్ద ఎత్తున చేయడం జరిగిందని అన్నారు. వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అలాగే భీమవరంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో గ్రంధి బాలాజీ, తోట భోగయ్య, పిప్పళ్ళ నాని, ముత్యాల బుజ్జి, కొప్పర్తి జనార్దన్, బొర్రా వాసు, తాళ్లపూడి పరమేశ్వరరావు, వేండ్ర విజయరామ్, రామభద్ర గౌడ్, వీరభద్ర గౌడ్, నిమ్మల బాలసుబ్రమణ్యం, మేకా శ్రీనివాసు, బొల్లా భాస్కర్, గుబ్బల వెంకటేశ్వరరావు, కైలా పాండురంగారావు, ఏఎస్ రాజు, అభిరుచి రఘు, చెన్ను చంటి, వాకా పెద్దిరాజు, ఉదయ్, గండికోట వీరస్వామి, ఎలకల ధర్మారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు కూడా సుఖశాంతులతో ఉండేలా అల్లా దీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ షేక్ రబ్బాని, అన్సారి, పాషా, జాఫర్ పాషా, ఇమాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం యాత్రను విజయవంతం చేయండి

భీమవరం అర్బన్: మండలంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేమంతా సిద్ధం ప్రచార యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. మండలంలో కోమటితిప్ప నార్త్ నుంచి సాయంత్రం 4 గంటలకు యాత్ర ప్రారంభమై దెయ్యాల తిప్ప, నాగిడిపాలెం, దిరుసుమర్రు, యనమదుర్రు గ్రామంలో ముగింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పెద్దెత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఏడుకొండలు పేర్కొన్నారు.

కాపు ఆత్మీయ సభకు వెళ్లిన నేతలు

ఆకివీడు: జగన్ ప్రభుత్వం మళ్లీ ఏర్పడేందుకు కాపులంతా పూర్తిగా కాపు కాస్తామని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య చెప్పారు. మండలంలోని కుప్పనపూడి, అజ్జమూరు గ్రామాలకు చెందిన నాయకులు ఉండి కోట్ల ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులు జనసేనకు అండగా ఉన్నారని అనడం అవాస్తవమన్నారు. సినీ అభిమానంతో కొందరు యువకులు మాత్రమే అటుగా వెళ్లుతున్నా వారి ఓటు కూడా ఫ్యాన్ గుర్తుకేనన్నారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలందరి బాగుకు తోడ్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెలంకూరి చల్లారావు, కుప్పపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): వేసవి దాహార్తికి చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో దాతల సహకారంతో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రైల్వే పార్శిల్ ఆఫీసర్ ఉదయిని మాట్లాడుతూ ప్రతి ఏడాది రైల్వే స్టేషన్లో దాతల సహకారంతో చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నెల రోజుల పాటు భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఈ మజ్జిగ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి, అరసవల్లి సుబ్రమణ్యం, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ఎస్ కె చాన్ భాషా రైల్వే సిబ్బంది పాల్గొన్నారు..

ప్రోత్సాహక బహుమతి అందజేత



విద్యార్థినికి రూ.10వేలు అందజేస్తున్న మధు క్రాంతి

ఆకివీడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 546 మార్కులు సాధించిన స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థిని బేసే ధరణికి సాలిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు యర్రా మధు క్రాంతి కేశవ శుక్రవారం ప్రోత్సాహక బహుమతిగా రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఉండిలో 17 నామినేషన్లకు ఆమోదం



నామినేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య, పరిశీలకుడు నిర్మల్‌రాజు

ఉండి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉండి అసెంబ్లీకి 21 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలన అనంతరం 17 నామినేషన్లను ఆమోదించినట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య తెలిపారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఒక నామినేషన్ తిరస్కరించడంతో పాటుగా మూడు నామినేషన్‌లు చెల్లుబాటు కాలేదని ఆయన చెప్పారు. నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఎల్ నిర్మల్‌రాజు, ఆయా అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి నామినేషన్లను పరిశీలన చేశారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రధాన అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా వేసిన గోపాలకృష్ణంరాజు, వేగేశ్న వెంకటరామరాజు, కనుమూరు భరత్ నామినేషన్లు చెల్లుబాటు కాలేదన్నారు. స్వతంత్ర అభ్యర్థి గుండే నగేష్‌బాబు నామినేషన్ ఫార్మాట్‌లో 10 మందికి బదులుగా కేవలం ఏడుగురితోనే ప్రపోజల్స్ సంతకాలు ఉండటంతో ఆ నామినేషన్‌ను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

జగన్‌కు ప్రజలు అండగా నిలవాలి



సీసలి గ్రామంలో పీవీఎల్‌కు పూలమాలలు వేసి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నేతలు



ప్రచార రథంలో ప్రజలకు అభివాదం చేస్తున్న పీవీఎల్ నరసింహరాజు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్
- కాళ్ల మండలంలో ఎన్నికల ప్రచారం

కాళ్ల: విద్య, వైద్యంతో పాటు సంక్షేమ పథకాలు అందించి పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు కోరారు. కాళ్ల మండలం సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో శుక్రవారం పార్టీ నేతలతో కలిసి పీవీఎల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు పీవీఎల్‌కు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహరాజు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజలకు కావలసిన విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చి సీఎం వైఎస్ జగన్ ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని అన్నారు. అధికారంలో ఉండగా పేదలను, మహిళలను, రైతులను పట్టించుకోని చంద్రబాబు నేడు అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసగించేందుకు మరలా సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న విషయం ప్రజలు ఇంకా మరువలేదన్నారు. ఎన్ని అమలుకానీ హామీలు ఇచ్చినా ప్రజలు చంద్రబాబు అండ్ పార్టీని నమ్మే పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. మాటిచ్చారంటే తప్పకుండా నెరవేర్చే మనస్తత్వం ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఉండి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరు ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత పీవీఎల్ ఆయా గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, జిల్లా సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, పాతపాటి యుగంధర్ వర్మ, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామ సర్పంచులు బిళ్ళకుర్తి ధనలక్ష్మి శ్రీనివాస్, కూచింపూడి పద్మావతి లక్ష్మీపతి రాజు, డొక్కు సోమేశ్వరరావు, వేగేశ్న జయరామ కృష్ణంరాజు, పెన్మెత్స దుర్గాప్రసాద్ రాజు, కూచంపూడి లక్ష్మీపతిరాజు, బిరుదు గడ్డ గంగాధర్, జవ్వాది సత్యనారాయణ, బిరుదుగడ్డ రమేష్, ఉండి ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఆకివీడు ఏఎంసీ వైస్ చైర్మన్ గంట ఆనందరావు, వేగేశ్న రవి రాజు, గొట్టుముక్కల రామకృష్ణరాజు, సుబ్బరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్ సోదరుడు గోపాలకృష్ణంరాజు

ఉండి: ప్రజల ఆశీస్సులతో ఉండిలో వైఎస్సార్ సీపీ గెలుపు సాధించడం ఖాయమని ఆ పార్టీ నేత పీవీఎల్ గోపాలకృష్ణంరాజు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఉండి నిమ్మనపేట, కాళింగపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలో వచ్చాక ప్రజలకు మొండిచెయ్యి చూపించిన చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగాలన్నా, ఉండిలో మరిన్ని అభివృద్ధి పనులు కొనసాగాలన్నారు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలు తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజును, ఎంపీగా గూడూరి ఉమాబాలను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, గ్రామ సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఉండి టౌన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కరిమెరక మల్లిఖార్జున, గలావిల్లి ధనుంజయ, మునుకోలు సింహాచలం, మండల బీసీ సెల్ అధ్యక్షుడు అంగర రాంబాబు, సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు తదతరులు పాల్గొన్నారు.

ముద్రగడ పర్యటన నా విజయానికి నాంది

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు

ఆకివీడు: కాపు జాతి కోసం అహర్నిశలు పోరాడుతున్న ముద్రగడ పద్మనాభం ఉండి నియోజకవర్గానికి రావడం తన విజయానికి నాంది అని వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. ఉండిలోని కోట్ల ఫంక్షన్ హాలులో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచేందుకు ఆనాడు ఉద్యమం చేస్తే చంద్రబాబు దాడి చేయించిన విషయాన్ని కాపు జాతి గుర్తుంచుకోవాలన్నారు. ముద్రగడ పద్మనాభం కాపు జాతికోసం పనిచేస్తుంటే, పవన్ కల్యాణ్ చంద్రబాబు ప్యాకేజీల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గమంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉందని చెప్పారు. కాపు సామాజిక వర్గం, అన్ని వర్గాల ప్రజల అండదండలతో తన గెలుపు ఖాయమని, ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మళ్లీ ఇక్కడే భారీ స్థాయిలో ముద్రగడ సమక్షంలో సంబరాలు చేసుకుందామని చెప్పారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడుతూ కాపులకు కొండంత అండగా ఉన్న ముద్రగడ పద్మనాభంనే చంద్రబాబు హించించారని, ఇంక కాపులను చంద్రబాబు ఏమి ఉద్ధరిస్తారో ఒక్కసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కాపులంతా రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి జగన్ సీఎం అవ్వడానికి తోడ్పడాలన్నారు. భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చంద్రబాబు ప్రభుత్వం చేసింది ఏమీలేదన్నారు. పవన్‌కల్యాణ్‌ను అడ్డుపెట్టుకుని కాపు ఓట్లు దండుకునేందుకు మళ్లీ మొసలికన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ కాపులకు జగన్ అత్యధిక సీట్లు కేటాయించారని, కూటమిలో ఉన్న పవన్‌కు చంద్రబాబు కూడా అన్ని సీట్లు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కాపులంతా జగన్‌కు అండగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు, ఆకివీడు, కాళ్ల మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అన్యెం కృష్ణ, గణేశ్న రాంబాబు, కరిమెరక రామచంద్రరావు, సాంబ్రాణి విశ్వేశ్వరరావు(విస్సు), కొట్టు ఆంజనేయులు, కఠారి కేశవరావు, పాతపాటి వర్మ, పెన్మెత్స గోపాలకృష్ణ, హరివర్మ, గుండాబత్తుల సుబ్బారావు, కుంకట్ల దానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పీవీఎల్ ఎన్నికల ప్రచారం

ఉండి: ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్రీరంగనాథరాజుకు కాపు సంఘ నాయకుల మద్దతు



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు మద్దతు తెలుపుతున్న నక్కావారిపాలెం గ్రామస్తులు

పెనుగొండ: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు పెనుగొండ మండలం నక్కావారిపాలేనికి చెందిన పలువురు కాపు సంఘ నాయకులు మద్దతు ప్రకటించారు. గురువారం రాత్రి పెనుగొండలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామని తెలిపారు. వర్గ భేదాలు లేకుండా ప్రతీ ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి సంక్షేమాన్ని అందించారని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. గతంలో గత పాలకులు కించ పరుస్తూ వ్యాఖ్యలు చేస్తూ, చివరకు సంక్షేమాన్ని సైతం అందించకుండా అడ్డుకునేవారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు సేవలందించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడిద కోదండ చక్రపాణి, కొమ్మిరెడ్డి హిమదత్, గాజుల బులిపుల్లారావు, సుంకర నాగాబాబు, కాపిశెట్టి మణికంఠ, రాజేష్‌లతో పాటు నక్కావారి పాలెం వాసులు నక్కా కృష్ణ, నక్కా సూర్యనారాయణ, సార శివప్రసాద్, అడ్డాల నాగేష్, పొల్నాటి వెంకన్న, దార్లంక శ్రీను, దాసిరెడ్డి దుర్గయ్య, దాసిరెడ్డి వెంకటరత్నం, నక్కా సూరి, నక్కా పెదకాపు, ఉమ్మిడి సత్యనారాయణ, నక్కా వెంకన్న, నక్కా చినబాబు, దివి నాగులు, ఉమ్మిడి రాఘవేంద్ర, దివిసాయి, నక్కాలక్ష్మీ నారాయణలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం: మోటార్ సైకిల్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం వెంకటేశ్వరరావు చెప్పారు. గురువారం రాత్రి మెంటేవారితోట బైపాస్‌రోడ్డు కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన కందుల వెంకటవేణుగోపాల్ మోటారు సైకిల్‌పై ఆరు మద్యం సీసాలతో వెళుతుండగా పట్టుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

వీరవాసరం: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రమేష్ తెలిపారు. ఇరగవరం మండలానికి చెందిన గంటా పద్మావతి ఈ నెల 19న తన పుట్టిల్లు అయిన వీరవాసరం గ్రామానికి వచ్చింది. తిరిగి ఈనెల 21న తన స్వగ్రామానికి వెళుతున్నానని చెప్పి వెళ్లింది. అయితే ఇంతవరకు ఇంటికి చేరకపోవడంతో ఆమె భర్త శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులందరూ కృషి చేయాలని జిల్లా సాధారణ పరిశీలకు ఎం.దీప, ఎల్.నిర్మల్ రాజ్, పోలీసు పరిశీలకులు శైలేష్ కుమార్ సిన్హాలు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సంయుక్తంగా సమావేశమై ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య, ఎఎస్పీ వి. భీమారావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ఆచంట నియోజకవర్గ ఆర్వో వి.స్వామి నాయుడు, పాలకొల్లు నియోజక వర్గ ఆర్వో బి.శివనారాయణ రెడ్డి, తణుకు నియోజక వర్గ ఆర్వో బి.వెంకట రమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదుకునే వారికి అండగా నిలవాలి

పెనుగొండ: కరోనా, వరదలు వంటి ఇతర ఆపత్కాలంలోనూ ఆదుకునే వారికి అండగా నిలవాలంటూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్ రాజు కోరారు. శుక్రవారం పెనుగొండలోని కంబాల వారి వీధి, జవ్వాది వారి వీధిల్లో శ్రీరంగనాథరాజు, గూడూరి ఉమాబాలలకు మద్దతు ప్రచారం నిర్వహించి రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. కరోనాతో పెనుగొండలో నాలుగైదు నెలలు పాటు ప్రజలు అష్టకష్టాలు పడితే మాజీ మంత్రిశ్రీరంగనాథరాజు తప్ప ఏ ఇతర నాయకుడూ ప్రజలవైపు కన్నెత్తి చూడలేదన్నారు. తూతూ మంత్రంగా పరామర్శలు చేసి వెళ్లిపోతే ఉపయోగం ఏముంటుంది? అని ప్రశ్నించారు. ప్రజలకు అండగా నిలిచి, భరోసా నిస్తూ వారికి కావాల్సిన నిత్యావసర వస్తువులతో పాటు, నిత్యం పౌర సేవలు అందించే విధంగా శ్రీరంగనాథరాజు కృషి చేశారన్నారు.